# ఆదిలాబాద్ వార్త



మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

సోమవారం 23, మార్చి 2026




# మందమర్రికి మినీ ట్యాంక్‌బండ్ శోభ

## రూ.2.31 కోట్ల అభివృద్ధి పనులకు మంత్రి వివేక్ భూమిపూజ

మందమర్రి, మార్చి 22, ప్రభాతవార్త

మందమర్రి పట్టణ అభివృద్ధిలో మరో కీలక అడుగు పడింది. పట్టణంలో రూ.2 కోట్ల 31 లక్షల వ్యయంతో చేపట్టనున్న మినీ ట్యాంక్ బండ్ సుందరీకరణ పనులకు రాష్ట్ర కార్మిక, గనుల శాఖ మంత్రి డా. జి. వివేక్ వెంకటస్వామి భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పట్టణాల్లో పర్యావరణ సౌందర్యాన్ని పెంపొందించడం మాత్రమే కాకుండా ప్రజలకు విశ్రాంతి, వినోదం కలిగించే ప్రదేశాలను అభివృద్ధి చేయడం ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. మినీ ట్యాంక్ బండ్ అభివృద్ధి పూర్తయితే స్థానిక ప్రజలకు ఉదయం, సాయంత్రం వేళల్లో సేదతీరే సౌకర్యాలు లభిస్తాయని పేర్కొన్నారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఇలాంటి అభివృద్ధి కార్యక్రమాలను మరింత విస్తరించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



## ప్రజా తీర్పును, కోర్టు ఆదేశాలను

# ధిక్కరిస్తున్న మంత్రి, ముఖ్యమంత్రి

### ● బాల్క సుమన్

క్యాతన్‌పల్లి, మార్చి 22, ప్రభాతవార్త

క్యాతన్‌పల్లి మున్సిపాలిటీ చైర్మన్, వైస్ చైర్మన్‌ల ఎన్నిక పై మంత్రి వివేక్, ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డిలు ప్రజా తీర్పును, కోర్టు ఆదేశాలను దిక్కరిస్తున్నారని చెన్నూర్ మాజీ ఎం.ఎల్.ఏ, మంచిర్యాల బి.ఆర్.ఎస్ జిల్లా అధ్యక్షుడు బాల్క సుమన్ అన్నారు. ఎన్నిక నేపథ్యంలో కండిషనల్ బెల్ పొందిన ఆయన ఆదివారం రామకృష్ణాపూర్ పోలీస్ స్టేషన్‌కు హాజరై సంతకం చేశారు. అనంతరం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్ని కుట్రలు చేసిన చైర్మన్ పీఠం బి.ఆర్.ఎస్ పార్టీ, వైస్ చైర్మన్ సిపిఐ పార్టీల కౌన్సిలర్‌లు అవుతారని బాల్క సుమన్ అన్నారు. కోర్టు మూడు వారాల గడువు విధించగా ప్రభుత్వం మొద్దు నిద్ర నటిస్తూ, రాష్ట్ర ప్రభుత్వం ఎలక్షన్ కమిషన్‌కు పంపాల్సిన సమ్మతి పత్రాలను పంపడం లేదని అన్నారు. ఈ అంశంపై కె.టి.ఆర్ అధ్యక్షతన రాష్ట్ర గవర్నర్‌ను కలుస్తామని అన్నారు. అలాగే కోర్ట్ ధిక్కారం అంశం పై మరోసారి కోర్ట్‌ను సంప్రదిస్తామని తెలియజేశారు. ఇప్పటికైన కాంగ్రెస్ ప్రభుత్వం క్యాతన్‌పల్లి మున్సిపాలిటీ ఎన్నిక నిర్వహించాలని డిమాండ్ చేశారు.



ప్రజా ప్రభుత్వంతోనే

# పల్లెల అభివృద్ధి సాధ్యం

* ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్
* కాంగ్రెస్ పార్టీలో కోయవాగు సర్పంచ్‌తో సహా పలువురి చేరిక

కాగజ్‌నగర్ రూరల్, మార్చి 22, ప్రభాతవార్త :

కాగజ్‌నగర్ మండలంలోని కోయవాగు గ్రామంలో రాజకీయంగా కీలక పరిణామం చోటుచేసుకుంది. గ్రామ సర్పంచ్ చింతపురి లక్ష్మీతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు బీఆర్ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్ ఆధ్వర్యంలో వీరు కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ దండే విఠల్ మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వంతోనే పల్లెలు సమగ్రంగా అభివృద్ధి చెందుతాయని తెలిపారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాలు మెరుగుపడాలంటే కాంగ్రెస్ పార్టీ పాలన అవసరమని ఆయన అభిప్రాయపడ్డారు. సిర్పూర్ నియోజకవర్గంలోని ప్రతి గ్రామాన్ని అభివృద్ధి చేసే బాధ్యతను తాను తీసుకుంటానని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన నాయకులు, కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటామని, వారికి పూర్తి ప్రాధాన్యం ఇస్తామని తెలిపారు. గ్రామ స్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేసేందుకు అందరూ మిగతా 2లో..

# విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా సౌకర్యాలు కల్పించాలి

### ✶ మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

జన్నారం, మార్చి 22, ప్రభాతవార్త

ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాలలో విద్య అభ్యసిస్తున్న విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సౌకర్యాలు కల్పించాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. ఆదివారం జిల్లాలోని జన్నారం మండల కేంద్రంలో గల ఆశ్రమ పాఠశాల, కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంను సందర్శించి తరగతి గదులు, వంటశాల, భోజనశాల, నిత్యావసర సరుకుల నిల్వలు, మధ్యాహ్న భోజనం నాణ్యత, హాజరు పట్టికలు, వసతి గదులు, పరిసరాల పరిశుభ్రత మిగతా 2లో..





ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు క్షేమం కోసం

# కొండగట్టుకు పాదయాత్ర

### ✪ మంచిర్యాల నుంచి కొండగట్టు అంజన్న సన్నిధికి మేయర్ కాలినడకన ప్రయాణం

నస్పూర్, మార్చి 22, ప్రభాతవార్త

మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని ఆకాంక్షిస్తూ మున్సిపల్ మేయర్ ధర్ని మధుకర్ ఆదివారం మహా పాదయాత్ర చేపట్టారు. సీతారాంపల్లిలోని హనుమాన్ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఆయన హనుమాన్ స్వాముల బృందంతో కలిసి కొండగట్టు అంజన్న సన్నిధికి కాలినడకన బయలుదేరారు. ఎమ్మెల్యే త్వరగా కోలుకోవాలని, 2029 ఎన్నికల్లోనూ విజయం సాధించి నియోజకవర్గ ప్రజలకు సేవలు అందించాలని ఈ మొక్కు మొక్కుకున్నట్లు మేయర్ మిగతా 2లో..



అభివృద్ధి పనుల కోసం ఎమ్మెల్సీకి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

## ప్రజా ప్రభుత్వంతోనే పల్లెల అభివృద్ధి సాధ్యం

(మొదటిపేజీ తరువాయి)

కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. అనంతరం గ్రామంలో పలు అభివృద్ధి పనులు చేయాలని కోరుతూ ఎమ్మెల్సీకి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కోయవాగు మాజీ ఉప సర్పంచ్ అదే రాజు, మాజీ కో ఆప్షన్ సభ్యుడు చౌటుభాయ్, వార్డు సభ్యులు ,ఇతర నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో మాలి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు లెండుగురే శ్యామ్‌రావు, కోయవాగు ఉప సర్పంచ్ మోరాయి శ్రీనివాస్, నాయకులు జావిద్, రాజు, గోవిందుల రాజు, కాంమ్రే విజయ్, తాజా మాజీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా సౌకర్యాలు కల్పించాలి

(మొదటిపేజీ తరువాయి)

పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యారంగాన్ని బలోపేతం చేస్తూ విద్యార్థులకు సకల సదుపాయాలతో కూడిన నాణ్యమైన విద్య అందించే దిశగా కృషి చేస్తుందని తెలిపారు. ప్రతి ప్రభుత్వ పాఠశాలలో త్రాగునీరు, విద్యుత్, విద్యార్థినీ విద్యార్థులకు వేరువేరుగా మూత్రశాలలు, ప్రహరీ గోడ ఇతర సదుపాయాలు కల్పించి విద్యార్థుల ఆరోగ్యం దృష్ట్యా పోషక విలువలతో కూడిన మెనూ అమలు చేయడం జరుగుతుందని, శుద్ధమైన త్రాగునీటిని అందించడం జరుగుతుందని తెలిపారు. నిష్ణాతులైన ఉపాధ్యాయులను నియమించి విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన అందించడం జరుగుతుందని తెలిపారు. ఉపాధ్యాయులు తరగతిలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని, విద్యార్థులు ప్రతిరోజు పాఠశాలకు హాజరయ్యేలా పర్యవేక్షించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు క్షేమం కోసం కొండగట్టుకు పాదయాత్ర

(మొదటిపేజీ తరువాయి)

తెలిపారు. ఎమ్మెల్యే దీర్ఘకాలం ఆరోగ్యంగా జీవించాలని మేయర్ ఈ సందర్భంగా ఆంజనేయ స్వామిని వేడుకున్నారు. యాత్ర సాఫీగా సాగాలని భక్తులు జయజయధ్వానాలు చేశారు. సీతారాంపల్లి హనుమాన్ ఆలయం వద్ద నిర్వహించిన ప్రత్యేక పూజల్లో మేయర్‌తో పాటు స్థానికులు, హనుమాన్ స్వాములు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ మహా పాదయాత్ర ప్రారంభోత్సవంలో పీసీసీ సభ్యుడు, నస్పూర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి నూకల రమేష్, 33వ డివిజన్ కార్పొరేటర్ ఎంబడి కుమార స్వామి హాజరై యాత్ర విజయవంతం కావాలని ఆకాంక్షించారు. నాయకులు, కార్యకర్తలు మేయర్‌కు సంఘీభావం తెలుపుతూ యాత్రలో అడుగులు వేశారు. భక్తిశ్రద్ధల మధ్య ప్రారంభమైన ఈ పాదయాత్ర కొండగట్టు అంజన్న ఆలయం వరకు కొనసాగనుంది.

## మండల కేంద్రానికి ఫైర్ స్టేషన్ మంజూరు: ఆడే గజేందర్

**నేరడిగొండ, మార్చి 22, ప్రభాతవార్త:**

బోథ్ మండల కేంద్రంలో కొత్త ఫైర్ స్టేషన్ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం పరిపాలనా పరమైన అనుమతులు మంజూరు చేసినట్లు బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఆడే గజేందర్ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. బోథ్ ప్రజల చిరకాల వాంఛను నెరవేర్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, ఇందుకు సహకరించిన జిల్లా ఇన్చార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావుకు, మాజీ కేంద్ర మంత్రి వేణుగోపాల్ చారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన గత ప్రభుత్వాన్ని విమర్శిస్తూ.. గత పదేళ్లలో ఫైర్ స్టేషన్ కోసం ఎన్ని ధర్నాలు చేసినా గత ప్రభుత్వం స్పందించలేదని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అతి తక్కువ కాలంలోనే ఈ సమస్యను పరిష్కరించిందని పేర్కొన్నారు. కొత్తగా మంజూరైన ఈ ఫైర్ స్టేషన్ నిర్వహణ కోసం ప్రభుత్వం మొత్తం 18 మంది సిబ్బందిని నియమించేందుకు ఆమోదం తెలిపిందని గజేందర్ వివరించారు. ఇందులో స్టేషన్ ఫైర్ ఆఫీసర్, లీడింగ్ ఫైర్‌మెన్, డ్రైవర్ ఆపరేటర్, ఫైర్‌మెన్, జూనియర్ అసిస్టెంట్, స్వీపర్ పోస్టులు ఉన్నట్లు తెలిపారు. ఈ యూనిట్ నిర్వహణకు ఏటా రూ.110.46 లక్షల వ్యయం కానుండగా, ప్రాథమిక ఏర్పాట్ల కోసం ప్రభుత్వం రూ.303.35 లక్షల నిధులు మంజూరు చేసిందని వెల్లడించారు. ఫైర్ స్టేషన్ అందుబాటులోకి రావడం వల్ల నియోజకవర్గంలో అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు ఆస్తి, ప్రాణ నష్టాన్ని నివారించే అవకాశం కలుగుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

## రాష్ట్రస్థాయిలో మెరిసిన బెల్లంపల్లి యువ సేవకుడు

### సామాజిక సేవకు ప్రతిఫలం - ఉగాది పురస్కారం అందుకున్న హనుమాండ్ల మధుకర్



**బెల్లంపల్లి, మార్చి 22, ప్రభాతవార్త**

బెల్లంపల్లి యువ సేవకుడికి రాష్ట్ర స్థాయి గౌరవం హనుమాండ్ల మధుకర్‌కు ప్రతిష్టాత్మక పురస్కారం హైదరాబాద్ నగరంలోని కేబీఆర్ కన్వెన్షన్ వేదికగా మార్చి 21 శనివారం సాయంత్రం 4 గంటలకు ఖగపద్మశాలి వి యాపార్ టెక్స్‌టైల్ అండ్ లైఫ్ స్టైల్ ఎక్స్‌పో-2026" అత్యంత ఘనంగా నిర్వహించబడింది. ఈ విశిష్ట కార్యక్రమాన్ని తెలంగాణ ప్రభుత్వం భాషా సాంస్కృతిక శాఖ, తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం మరియు తెలంగాణ చేనేత ఐక్య వేదిక సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా వివిధ రంగాల్లో విశేష సేవలు అందించిన ప్రతిభావంతులను గుర్తించి ఖగపద్మశాలి ఉగాది పురస్కారాలు-2026"తో సత్కరించారు. సామాజిక సేవ, విద్య, చేనేత, వ్యాపారం, సాంస్కృతిక రంగాలలో కృషి చేసిన వ్యక్తులకు ఈ అవార్డులు అందజేయడం ద్వారా వారి సేవలను సమాజం ముందు నిలిపారు. ఈ గౌరవనీయమైన వేడుకలో మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి పట్టణానికి చెందిన అమ్మ ఒడి ఎన్‌జీవో ఖగఅన్నదాత ప్రాజెక్ట్" బ్రాంచ్ మేనేజర్ హనుమాండ్ల మధుకర్ ప్రతిష్టాత్మక ఉగాది పురస్కారం అందుకున్నారు. సమాజ సేవలో ఆయన చేసిన సేవలు, ముఖ్యంగా ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు ఆహారం, సహాయం అందించడం, అవసరమైన వారికి అండగా నిలవడం వంటి కార్యక్రమాలు ఆయనకు ఈ గౌరవాన్ని తీసుకువచ్చాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన ప్రముఖ సినీ నటుడు, మాజీ మంత్రి బాబు మోహన్, అలాగే భారతీయ రైల్వే అకౌంట్స్ సర్వీస్‌కు చెందిన ఉన్నతాధికారి కోట్ల ఉదయ్ నాథ్ (డిప్యూటీ సీఏఓ/జీ, సౌత్ సెంట్రల్ రైల్వేస్)లు హనుమాండ్ల మధుకర్ కు ఈ అవార్డును ప్రదానం చేశారు. అదేవిధంగా తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం అధ్యక్షులు రాపోలు వీర మోహన్, కార్యక్రమ డైరెక్టర్ ఇప్పలపల్లి రమేష్, ఇతర ప్రముఖులు హాజరై విజేతలను అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజ అభివృద్ధిలో ప్రతి ఒక్కరి పాత్ర కీలకమని, సేవా భావంతో పనిచేసే వ్యక్తులను ప్రోత్సహించడం ఎంతో అవసరమని పేర్కొన్నారు. హనుమాండ్ల మధుకర్ పురస్కారం అందుకోవడం పట్ల బెల్లంపల్లి పట్టణ ప్రజలు, స్నేహితులు, సామాజిక కార్యకర్తలు ఆనందం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు. ఆయన సాధించిన ఈ గౌరవం యువతకు ప్రేరణగా నిలుస్తుందని, సేవా మార్గంలో ముందుకు సాగేందుకు ప్రోత్సాహం కలిగిస్తుందని పేర్కొన్నారు. ఈ అవార్డు ద్వారా బెల్లంపల్లి పేరు రాష్ట్ర స్థాయిలో మారుమోగిందని, ఇలాంటి ప్రతిభలను గుర్తించి ప్రోత్సహించడం సమాజానికి ఎంతో మేలు చేస్తుందని పలువురు అభిప్రాయపడ్డారు.

## బాలభారతిలో పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక

### - స్నేహానికి సాక్షిగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

### - నాలుగు దశాబ్దాల తర్వాత స్నేహితుల కలయిక

**కాగజ్‌నగర్, మార్చి 22, ప్రభాతవార్త :**



కాగజ్‌నగర్ బాలభారతి పాఠశాలలో 1984-85 విద్యా సంవత్సరంలో 10వ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఎస్పీఎం హెచ్ఆర్‌డీ హాల్‌లో ఒకే వేదికపై కలుసుకున్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారు ఎంతో ఆనందంతో పరస్పరం ఆత్మీయంగా పలకరించుకున్నారు.చాలా కాలం తర్వాత స్నేహితులను చూసిన పూర్వ విద్యార్థులు పేర్లు పెట్టి పిలుచుకుంటూ కౌగిలించుకోవడంతో సభా ప్రాంగణం హర్షధ్వనులతో మార్మోగింది. చదువుకున్న రోజుల జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ భావోద్వేగానికి లోనయ్యారు.తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులు సలీం, చారి, స్వర్ణలక్ష్మి, గోవిందరావు, శంకర్రావు తదితరులను ఘనంగా సన్మానించి వారి ఆశీర్వాదం పొందారు. గురువులను సత్కరించడం కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.అనంతరం పూర్వ విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి ఉత్సాహంగా పాల్గొన్నారు. పాత జ్ఞాపకాలను పంచుకుంటూ సంతోషంగా గడిపారు.ఈ కార్యక్రమం విజయవంతానికి కంభంపాటి వేణుగోపాల్, విడిదినేని శ్రీనివాసరావు, పార్లపల్లి నారాయణ, పర్రె సురేష్, డి.వెంకటేశ్వర, లక్ష్మణ్, మాధవీలత, గీత తదితరులు కృషి చేశారు.

## రైతులు పూర్తి మద్దతు ధర పొందాలి

### - సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు

### - కాగజ్‌నగర్ బీట్ మార్కెట్‌లో శనగల కొనుగోలు కేంద్రం ప్రారంభం

**కాగజ్‌నగర్ రూరల్,మార్చి 22, ప్రభాతవార్త :**



కాగజ్‌నగర్‌లోని బీట్ మార్కెట్‌లో మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శనగల కొనుగోలు కేంద్రాన్ని సిర్పూర్ శాసనసభ్యులు డా. పాల్వాయి హరీష్ బాబు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దహెగాం మండలం కర్జి, గిరివెల్లి ప్రాంతాల్లో దాదాపు వెయ్యి క్వింటాళ్లకు పైగా శనగల ఉత్పత్తి జరిగినట్లు రైతుల ద్వారా తెలిసిందని తెలిపారు. రైతుల ప్రయోజనాన్ని దృష్టిలో ఉంచుకుని మార్క్‌ఫెడ్ అధికారులతో చర్చించి ఈ కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయించినట్లు వివరించారు. శనగలు పండించిన రైతులు ఈ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకుని పూర్తి మద్దతు ధరను పొందాలని ఆయన కోరారు. మధ్యవర్తులపై ఆధారపడకుండా నేరుగా ప్రభుత్వ కొనుగోలు కేంద్రానికి తమ పంటను తీసుకురావాలని సూచించారు.ఈ కొనుగోలు కేంద్రం ద్వారా రైతులకు సరైన ధర లభించడంతో పాటు మార్కెటింగ్‌లో పారదర్శకత పెరుగుతుందని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ జిల్లా అధికారి వెంకటి, మార్కెట్ కమిటీ చైర్మన్ సిద్దాల దేవయ్య, జిల్లా మార్కెటింగ్ అధికారి అష్ఫాక్, ఏడీఏ మనోహర్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ సామ్యూల్, మండల వ్యవసాయ శాఖ అధికారులు ప్రేమలత, కార్తీష, ఏఈఓలు దుర్గా భవానీ, సృజన, శ్రీనివాస్, పీఏసీఎస్ కార్యదర్శి సతీష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## బిట్స్‌ల్, జీవీకే బ్రదర్స్ ఆధ్వర్యంలో ఉచిత జాబ్ మేళా జయప్రదం

### పాల్గొన్న 500 ప్రముఖ కంపెనీలు - 268 మంది ఎంపిక

**లక్షెట్టిపేట, ప్రభాతవార్త**



లక్షెట్టిపేట పట్టణంలో ఆదివారం బిట్స్‌ల్, జీవీకే బ్రదర్స్ ఆధ్వర్యంలో ఉచిత జాబ్ మేళాను పట్టణంలోని ఎస్.ఆర్.ఆర్ గార్డెన్స్ నందు నిర్వహించడం జరిగింది.ఈ ఉచిత జాబ్ మేళాకు యాభైకి పైగా ప్రముఖ కంపెనీలు వచ్చాయి. జిల్లాలోని ఏడు వందల పైగా నిరుద్యోగ యువతీ యువకులు పాల్గొన్నారు. ఈ జాబ్ మేళాకు ముఖ్య అతిధిగా జీవికే ఎడ్యుకేట్ సంస్థ నిర్వాహకులు విద్యాకుమార్, ప్రవీణ్ సిద్దు, ప్రభాకర్ చౌటి హాజరై మాట్లాడుతూ... పేద బడుగు బలహీన వర్గాల నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడానికి ఉచిత జాబ్ మేళను నిర్వహించిన బిట్స్‌ల్ సంస్థ సీఈఓ దుంపల సన్నీకి అభినందనలు తెలియచేస్తున్నాం. నేటి పోటీ ప్రపంచంలో ఉద్యోగాల సాధనకై నేటి యువత అన్నింటిలో తమ నైపుణ్యాలను పెంచుకోవాల్సిన అవసరం ఉంది. పేదరికం అనేది ఉన్నత లక్ష్యాలను చేరుకోవడానికి అడ్డు కాదన్నారు. యువత తమ ఆలోచన విధానాలను మార్చుకుంటూ తమ తల్లిదండ్రులకు మంచి పేరు తెచ్చే విధంగా సమాజంలో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. ఈ జాబ్ మేళలో పాల్గొన్న యువతకు మంచిర్యాల, కరీంనగర్, హైదరాబాద్ నందు ప్రముఖ కంపెనీలలో రెండు వందల అరవై ఎనిమిది మంది యువత ఉద్యోగాలకు ఎంపిక కావడం జరిగింది. ఉద్యోగాలు సాధించిన నిరుద్యోగులకు ఆయా కంపెనీల నుంచి అలాట్మెంట్ ఆర్డర్ కాపీలు కూడా అందజేయడం జరిగింది. ఈ జాబ్ మేళా బిట్స్‌ల్ కంపెనీ నిర్వాహకులు అడ్లూరి మధుకర్, అవునూరి పెన్సిల్,పెరక రాహుల్, చందు, దీపక్, మహేష్, సాగర్, నగేష్, సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## శనగ కొనుగోలు కేంద్రం ప్రారంభం

**కుబీర్, మార్చి 22, ప్రభాతవార్త:**



రైతుల సంక్షేమమే ధ్యేయంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పని చేస్తున్నాయని ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ తెలిపారు. ఆదివారం కుబీర్ మార్కెట్ యార్డులో మార్క్‌ఫెడ్, నాఫెడ్, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శనగ కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. శనగ పండించిన రైతులు ప్రైవేటు వ్యాపారుల వద్ద అమ్మి నష్టపోకుండా, ప్రభుత్వం కల్పిస్తున్న మద్దతు ధర సౌకర్యాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ప్రస్తుతం క్వింటాలు శనగకు రూ.5,875 మద్దతు ధర నిర్ణయించామని, రైతులు తమ పంటలో తేమ శాతం 14 మించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ప్రైవేటు మార్కెట్ ధరల కంటే ప్రభుత్వ మద్దతు ధర ఎక్కువగా ఉన్నందున, రైతులు ఈ కేంద్రాల్లోనే తమ పంటను విక్రయించి లాభపడాలని కోరారు. అలాగే నియోజకవర్గంలోని రైతుల కోసం త్వరలోనే మక్కా, జొన్న కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లానని, అతి త్వరలో ఆ కేంద్రాలు కూడా అందుబాటులోకి వస్తాయని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సాయినాథ్, ఏఎంసీ చైర్మన్ కళ్యాణ్, భైంసా మార్కెట్ చైర్మన్ ఆనందరావు పటేల్, వడ్నం నాగేష్, మోహన్, వివేకానంద, విట్టల్, దత్తు, బషీర్ బాబు, పురంశెట్టి రవికుమార్, మారుతి, గంగా చరణ్, రైతులు, వ్యాపారవేత్తలు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

**- ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్**

**భైంసా, మార్చి 22, ప్రభాతవార్త:**

తెలుగు నూతన సంవత్సరం ఉగాదిని పురస్కరించుకుని ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్‌ను పీఆర్‌టీయూ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.వి. రమణారావు ఆదివారం భైంసాలోని ఎస్ఎస్ జిన్నింగ్ ఫ్యాక్టరీలో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని ఉపాధ్యాయ లోకానికి ఎమ్మెల్యే నూతన సంవత్సర శుభాకాంక్షలు అందజేశారు. అనంతరం ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న పలు దీర్ఘకాలిక ఆర్థిక సమస్యలపై ఎమ్మెల్యేకు వినతిపత్రం సమర్పించారు. పెండింగ్‌లో ఉన్న డీఏలు, జీపీఎఫ్, సరెండర్ బిల్లుల తక్షణ మంజూరుతో పాటు, జూలై 2023 నుండి అమలు కావాల్సిన పీఆర్‌సీ అంశాన్ని రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో ప్రస్తావించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. దీనిపై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందిస్తూ.. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. నూతన సంవత్సరంలో గ్రామీణ ప్రాంతాల్లో విద్యాభివృద్ధికి ఉపాధ్యాయులు మరింత శ్రమించి, క్రమశిక్షణ కలిగిన ఉత్తమ పౌరులను తీర్చిదిద్దాలని ఆయన సూచించారు. విద్యా రంగానికి తన వంతు సహకారం అందిస్తున్నట్లు తెలుపుతూ.. భైంసా, ముధోల్‌లలోని మైనారిటీ గురుకుల పాఠశాల భవనాల నిర్మాణానికి ఒక్కొక్క దానికి రూ.33 లక్షల చొప్పున నిధులు మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే వెల్లడించారు. అలాగే రెండు పట్టణాల్లోని జూనియర్ కళాశాల భవనాల నిర్మాణానికి రూ.24 లక్షల చొప్పున నిధులు కేటాయించినట్లు తెలిపారు. విద్యా సౌకర్యాల మెరుగుదలకు ప్రాధాన్యతనిస్తూ నిధులు మంజూరు చేసినందుకు పీఆర్‌టీయూ సంఘం పక్షాన ఎమ్మెల్యేకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూ భైంసా మండల అధ్యక్షులు ఎస్. గంగాధర్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు జై శివరాం, జిల్లా ఉపాధ్యక్షులు ఏ. గోపాల్, సంజయ్ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలుపుతున్న పీఆర్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి బి.వి. రమణారావు



## గాయపడిన కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షుడు ఉదయ్‌ను పరామర్శించిన మంత్రి వివేక్

**మందమర్రి, మార్చి 22, ప్రభాతవార్త**

మందమర్రి పట్టణ కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ అధ్యక్షుడు సోతుకు ఉదయ్ కుమార్ ఇటీవల ప్రమాదంలో గాయపడిన నేపథ్యంలో రాష్ట్ర మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి ఆయనను పరామర్శించారు. ఈ సందర్భంగా మంత్రి మందమర్రి పట్టణంలోని ఉదయ్ స్వగృహానికి వెళ్లి ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఉదయ్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షి స్తూ అవసరమైన సహాయం అందిస్తామని మంత్రి భరోసా ఇచ్చినట్లు తెలిసింది. నాయకులు, కార్యకర్తలు కూడా ఉదయ్‌కు మద్దతుగా నిలుస్తూ ఆయనను ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో మందమర్రి పట్టణ కాంగ్రెస్ పార్టీ నాయకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, సోషల్ మీడియా వారియర్స్, మహిళా నాయకురాళ్లు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న పోలీసులు

## సేవా కార్యక్రమాల్లో కోటపల్లి పోలీసులు

**- ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు**

**చెన్నూరు, మార్చి 22, ప్రభాతవార్త**

శాంతి భద్రతలను కాపాడడమే కాకుండా ప్రజాసేవ చేయడంలోనూ ముందుంటున్నారు. కోటపల్లి పోలీసులు. మంచిర్యాల జిల్లా కోటపల్లిలో వేసవి కాలం దృష్టిలో పెట్టుకుని ప్రయాణీకుల దాహార్తి తీర్చడం కోసం కోటపల్లి పోలీసుల ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఈ చలివేంద్రాన్ని ప్రారంభించడానికి ముఖ్య అతిథులుగా కోటపల్లి సీఐ ఆర్. కృష్ణ, ఎస్ఐ రాజశేఖర్, కోటపల్లి సర్పంచ్ సంపత్ హాజరై, రిబ్బన్ కట్ చేసి చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఐ కృష్ణ మాట్లాడుతూ, ఎండలు తీవ్రమవుతున్న నేపథ్యంలో ప్రజలకు కనీస సౌకర్యంగా మంచినీటిని అందించాలనే ఉద్దేశంతో ఈ చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కేవలం శాంతి భద్రతల పరిరక్షణే కాకుండా, సామాజిక బాధ్యతగా ఇలాంటి సేవా కార్యక్రమాలు చేపట్టడం సంతోషంగా ఉందని ఆయన పేర్కొన్నారు. సర్పంచ్ సంపత్ మాట్లాడుతూ. ఈ చలివేంద్రం నిర్వహణ బాధ్యత గ్రామ పంచాయతీ తరపున తాను తీసుకుంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక పోలీసు సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

## యువకుడి హత్య కేసులో నిందితుల అరెస్ట్

**మంచిర్యాల, మార్చి 22, ప్రభాతవార్త**



మంచిర్యాల పట్టణంలోని కాలేజీ రోడ్డులో ఈనెల 19న జరిగిన యువకుడి హత్య కేసులో నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. ప్రదీప్ (35) అనే యువకుడిని దారుణంగా హత్య చేసిన ఘటనలో నిందితులైన కాసిపేట మండలం పల్లంగూడ నివాసి భీమిని సంజీవ్ (28), మహారాష్ట్రలోని ఆహెరి నివాసి సీడం ప్రదీప్ (37)లను ఆదివారం అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుండి హత్యకు ఉపయోగించిన ఆయుధాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పట్టణ సీఐ ప్రమోద్ రావు తెలిపిన వివరాల ప్రకారం.. నిందితులను ఆదివారం మంచిర్యాల కోర్టులో హాజరుపరచగా, న్యాయమూర్తి వారికి 14 రోజుల రిమాండ్ విధించారు. ఈ మేరకు నిందితులను లక్షెట్టిపేట సబ్ జైలుకు తరలించినట్లు సీఐ వెల్లడించారు. పట్టణ నడిబొడ్డున జరిగిన ఈ హత్య కేసును ఛేదించడంలో చురుగ్గా వ్యవహరించిన పోలీసు బృందాన్ని ఉన్నతాధికారులు అభినందించారు.



కొత్త మోటారు ప్రారంభిస్తున్న దృశ్యం

## వేసవిలో త్రాగునీటి ఎద్దడికి చెక్..

**- నీల్వాయి సర్పంచ్ చెన్నూరి సమ్మయ్య**

**వేమనపల్లి, మార్చి 22, ప్రభాతవార్త**

నీల్వాయి గ్రామంలో సర్పంచ్ ఎన్నికల్లో భాగంగా ఇచ్చిన మాటకు కట్టుబడి నీల్వాయి గ్రామ పంచాయతీ పరిధిలోని కల్మలపేట గ్రామంలో ప్రజల సౌకర్యార్థమై వేసవి కాలంలో నీటి ఎద్దడి తలెత్తకుండా నూతన మోటార్‌ను బిగించడం జరిగిందని నీల్వాయి సర్పంచ్ చెన్నూరి సమ్మయ్య తెలిపారు. మాజీ జడ్పీటీసీ ఆర్ సంతోష్ కుమార్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సయ్యద్ సాబీర్ అలీ, కాగ్రేస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గాలి మధు లు కలిసి నూతన మోటార్ ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వుప్పులపు సాయికృష్ణ, శ్రీలత సత్యనారాయణ, సర్పంచ్ దుర్గం భాగ్యలక్ష్మి తిరుపతి, మడే శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## రైతు నేస్తం కార్యక్రమం

**- దృశ్య శ్రవణ మాధ్యమం ద్వారా రైతుల వీక్షణ**

**వేమనపల్లి, మార్చి 22, ప్రభాతవార్త**

రైతు మహోత్సవ కార్యక్రమం వేమనపల్లి, నీల్వాయి రైతు వేదికలో దృశ్య శ్రవణ మాధ్యమం( వీడియో కాన్ఫరెన్స్)లో ప్రత్యక్ష ప్రసారం రైతు నేస్తం కార్యక్రమం ద్వారా ఆదివారం వీక్షించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా జరగనున్న ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ ప్రారంభోత్సవం, రైతు భరోసా మొదటి నిధుల విడుదల కార్యక్రమాన్ని వీక్షించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రైతులను ఉద్దేశించి మాట్లాడటం జరిగింది. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు రోక్సర్ సుల్తానా, హెప్సిబా, సర్పంచులు వుప్పులపు సాయి కృష్ణ, ఆలం లక్ష్మణ్, నాయకులు తోకల రాంచందర్, నీకాడి భగవంతు, రైతులు పాల్గొన్నారు.



## తర్నం (కె)లో అగ్నిప్రమాదం

**- రైతు కొట్టం దగ్ధం**

**నేరడిగొండ, మార్చి 22, ప్రభాతవార్త:**

నేరడిగొండ మండలంలోని తర్నం (కె) గ్రామంలో ఆదివారం జరిగిన అగ్నిప్రమాదంలో ఒక రైతుకు చెందిన కొట్టం పూర్తిగా అగ్నికి ఆహుతైంది. గ్రామానికి చెందిన రైతు రాజేందర్ రెడ్డి తన ఇంటి పక్కనే నిర్మించుకున్న కొట్టంలో అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. మంటలను గమనించిన గ్రామస్థులు వెంటనే అప్రమత్తమై నీళ్లు చల్లి ఆర్పేందుకు శతవిధాలా ప్రయత్నించారు. అయితే ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటం, దానికి తోడు గాలులు బలంగా వీయడంతో మంటలు క్షణాల్లోనే విస్తరించి కొట్టాన్ని పూర్తిగా దహించివేశాయి. ఈ ప్రమాదంలో రైతుకు భారీగా ఆస్తి నష్టం వాటిల్లింది. మంటలు అదుపులోకి వచ్చే సమయానికి కొట్టంలోని సామగ్రి అంతా బూడిదైంది. అగ్నిప్రమాదానికి గల కారణాలు ఇంకా తెలియాల్సి ఉంది.



## బడ్జెట్ ప్రతులు దహనం

**- బడ్జెట్ కేటాయింపుల్లో బీసీలకు అన్యాయం**

**మంచిర్యాల,మార్చి 22, ప్రభాతవార్త:**

మంచిర్యాల పట్టణంలోని బెల్లంపల్లి చౌరస్తాలో ఆదివారం రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు కేటాయించిన బడ్జెట్ కేటాయించనందున బడ్జెట్ ప్రతులను జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో దహనం చేసి అనంతరం నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే లక్ష కోట్ల బడ్జెట్ కేటాయిస్తామని తన ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టి తీరా అధికారం చేపట్టి రెండున్నర సంవత్సరాలు అవుతున్న బీసీల జనాభా ప్రతిపాదికన బడ్జెట్ కేటాయించిన సందర్భంగా లేకపోవడం అంటే ఇది బీసీలపై వివక్షగా భావిస్తున్నాం బడ్జెట్ సమావేశాల కంటే ముందే బీసీలకు 50 వేల కోట్ల బడ్జెట్ కేటాయించాలని డిమాండ్ చేసినప్పటికీ,మా డిమాండ్‌ను రాష్ట్ర ప్రభుత్వం పెడచెవిన పెట్టడం బాధాకరం మొదటి బడ్జెట్ సమావేశాల్లో 20 వేల కోట్ల బడ్జెట్ కేటాయించాల్సిన స్థానంలో తొమ్మిది వేల కోట్లు రెండో బడ్జెట్ సమావేశాల్లో 11 వేల కోట్లు మరి మొన్నటి సమావేశంలో 12,511 కోట్లు మాత్రమే 56 బీసీ జనాభా ఉంటే బీసీలకు కేటాయించింది నామమాత్రమే, ఈ రాష్ట్రంలో ఉన్న బీసీలకు బిస్కెట్లకు కూడా సరిపోవు బీసీల ఆర్థిక అభివృద్ధి ఎలా సాధ్యమని అడుగుతున్నామని, ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్ పై పునర్ సమీక్ష చేయాలని డిమాండ్ చేస్తున్నామని, లేనిపక్షంలో ఈ అంశాన్ని బీసీ సమాజం దృష్టికి తీసుకువెళ్లి కాంగ్రెస్ పార్టీని బీసీ సమాజం ముందు కాంగ్రెస్‌ని ఎండగట్టి దోషిగా నిలబెడతమని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారు జిల్లా అధ్యక్షులు గుమ్ముల శ్రీనివాస్, వేముల అశోక్, రామగిరి రాజన్న చారి, మహిళా నాయకురాలు పేరం అలేఖ్య, కొట్టే నటేశ్వర్, మంచెర్ల సదానందం చంద్రగిరి చంద్రమోళి తదితరులు పాల్గొన్నారు.

# రాజకీయాలకు అతీతంగా ఐక్యత సాధిస్తేనే అభివృద్ధి

## - రాష్ట్ర వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరన్న

**హాజీపూర్, మార్చి 22,ప్రభాతవార్త**

రాజకీయాలకు అతీతంగా పెరిక కుల బాంధవులు ఐక్యత సాధిస్తేనే పూర్తి స్థాయిలో అభివృద్ధి సాధ్యమని ఇందుకు పెరిక కుల సభ్యులు మరింతగా శ్రమించి సంఘాన్ని బలోపేతం చేసుకునే దిశగా ముందుకు సాగాలని రాష్ట్ర వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరన్న పిలుపునిచ్చారు. ఆదివారం మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ లోని వేంపల్లిలో గల మంచిర్యాల గార్డెన్స్ లో పెరిక ప్రజాప్రతినిధుల్లో మంచిర్యాల నగర కార్పొరేటర్లుగా ఎన్నికైన లగిశెట్టి రాజన్న, బియ్యల త్రివేణి, పెట్టెం స్వరూప, ఎంబడి కుమారస్వామిలతో పాటు జిల్లాలోని పెరిక ప్రజాప్రతినిధుల్లో 8 మంది వైస్ చైర్మన్, కౌన్సిలర్లను, 60 మంది సర్పంచ్, ఉప సర్పంచ్లను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా చైర్మన్ వీరన్న మాట్లాడుతూ, కుల సంఘం బలోపేతం జరిగితేనే భవిష్యత్తులో అనేక సేవా కార్యక్రమాలు చేపట్టే అవకాశం కలుగుతుందని, పెరిక కులస్థులు అహర్నిశలు శ్రమించి అంతా ఏకతాటిపైకి వస్తేనే రాజకీయంగా ఎదగడంతో పాటు అన్ని విధాలుగా అభివృద్ధి సాధించడం జరుగుతుందన్నారు. అనంతరం పెరిక సంఘం జిల్లా మహిళా అధ్యక్షురాలిగా అత్తె సరోజ,జిల్లా యువజన విభాగం అధ్యక్షుడిగా కారుకూరి మనోజ్ లను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర పెరిక సంఘం అసోసియేట్ అధ్యక్షుడు సుంకరి ఆనంద్, పెరిక కుల సంఘం మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు బొడ్డు శంకర్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ చుంచు రాజు కిరణ్, కోశాధికారి నెల్కి మల్లేశ్, మంచిర్యాల నగర అధ్యక్షుడు బొడ్డు తిరుపతి, మార్కెట్ కమిటీ చైర్మన్ పద్మ, నాయకులు డాక్టర్ రమణ, సింగతి మురళీ, అత్తి సరోజ,బొడ్డు రఘునందన్, పెట్టెం లక్ష్మణ్,కందుల రమేష్, పెరిక కుల బాంధవులు పాల్గొన్నారు.


పెరిక ప్రజా ప్రతినిధులకు సన్మానం చేస్తున్న పెరిక సంఘం నాయకులు


బీజేపీ పార్టీలో చేరిన వారితో దృశ్యం

## బీజేపీ పార్టీలో చేరికలు

**వేమనపల్లి, మార్చి 22, ప్రభాతవార్త**

బీజేపీ పార్టీ కార్యాలయం చెన్నూరులో ఆదివారం బీజేపీ జిల్లా అధ్యక్షులు నగునూరు వెంకటేశ్వర్ గౌడ్, వేమనపల్లి మండల అధ్యక్షులు ఏటా రవికుమార్ ఆధ్వర్యంలో బీజేపీ రాష్ట్ర నాయకులు కొయ్యల ఏమాజీ సమక్షంలో బుయ్యారం గ్రామానికి చెందిన కొరకొప్పుల విజయ్ కుమార్, కొండగొర్ల రాజయ్య, దుర్గం పోషయ్య బీజేపీ పార్టీలో చేరడంతో పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల నాయకులు కొత్తూరి పోచయ్య, కొటారి సతీష్, బీజేపీ మండల మహిళా మోర్చా అధ్యక్షురాలు ముడిమడుగుల లావణ్య తదితరులు పాల్గొన్నారు.



## ఎమ్మెల్యేను కలిసిన గజానంద్ నాయక్

**ఉట్నూర్, మార్చి 22,ప్రభాత వార్త :**

నార్నూర్, ఇంద్రవెల్లి మండలానికి చెందిన సీనియర్ నాయకులకు ఆదిలాబాద్ డీసీసీ కమిటీలో స్థానం కల్పించిన సందర్భంగా ఆదివారం ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ భోజ్జు పటేల్ ని సర్పంచుల సంఘం మాజీ రాష్ట్ర కార్యదర్శి బాణోత్ గజానంద్ నాయక్ మర్యాదపూర్వకంగా కలిసి శాలువతో సన్మానించారు. వారితో పాటు జేఏసీ మాజీ చైర్మన్ ఉత్తం రాథోడ్, ఇంద్రవెల్లి సర్పంచ్ మోహన్ నాయక్, డీసీసీ కార్యదర్శులు ఎండి మసూద్, నాగనాథ్ తదితరులున్నారు.

## అభివృద్ధి పనులకు భూమిపూజ

**ఇచ్చోడ, మార్చి 21, ప్రభాతవార్త:**

మండలంలోని కామగిరి గ్రామంలో రూ.39 లక్షల వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు శనివారం భూమిపూజ నిర్వహించారు. బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఆడే గజేందర్, గ్రామ సర్పంచ్ నిమ్మల సుప్రియ సుధాకర్ రెడ్డితో కలిసి ఈ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆడే గజేందర్ మాట్లాడుతూ.. గ్రామాల సమగ్ర అభివృద్ధే తమ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ప్రజలందరికీ ప్రాథమిక వసతులు కల్పించేలా నిరంతరం కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఇందులో భాగంగానే గ్రామంలో రోడ్లు, డ్రైనేజీలు, కల్వర్టుల నిర్మాణ పనులను ప్రారంభించామని, భవిష్యత్తులో ప్రజల అవసరాలకు అనుగుణంగా మరిన్ని నిధులు కేటాయించి అభివృద్ధి పనులు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇచ్చోడ మార్కెట్ కమిటీ చైర్మన్ సత్యవతి కోటేశ్వర్, మండల అధ్యక్షుడు కళ్యాం నారాయణ రెడ్డి, నియోజకవర్గ మైనారిటీ చైర్మన్ ముస్తఫా, ఎస్సీ సెల్ చైర్మన్ కొత్తూరి లక్ష్మణ్, ఉపసర్పంచ్ కనక విజయ్ కాంత రామేశ్వర, గ్రామ పటేల్ జుగ్నక్ ప్రవీణ్, నక్కల రమణ రెడ్డి, ఏనుగు విద్యా సాగర్, ఆశన్న, సీనియర్ నాయకులు ప్రవీణ్ రెడ్డి, యువజన అధ్యక్షుడు బద్దం పోతారెడ్డి, ఎండీ సద్దాం, తమీమ్ ఖాన్, రాందాస్, సాగర్ రెడ్డి పాల్గొన్నారు.



## విషాద కుటుంబాలను పరామర్శించిన బలరాం జాదవ్

**సోనాల, మార్చి 22, ప్రభాతవార్త:**

సోనాల మండలం కోఠ గ్రామానికి చెందిన ప్రముఖ వైద్యులు డాక్టర్ శంకర్ కేంద్రే కుమారుడు డాక్టర్ ఆశిష్ కుమార్ కేంద్రే అకాల మరణం చెందడం పట్ల తెలంగాణ రాష్ట్ర అధ్యాపక సంఘం ప్రధాన కార్యదర్శి బలరాం జాదవ్ తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఆదివారం ఆయన కోఠ గ్రామానికి చేరుకుని మృతుని తండ్రి డాక్టర్ శంకర్ కేంద్రేను, కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆశిష్ కుమార్ మృతికి గల కారణాలను అడిగి తెలుసుకుని, ఆ కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అనంతరం ఆయన సాకేరా గ్రామానికి వెళ్లి, ఇటీవల మృతి చెందిన ఉపసర్పంచ్ రాథోడ్ భీంరావు మాతృమూర్తి భౌతిక కాయానికి నివాళులర్పించారు. భీంరావును పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈ పరామర్శ కార్యక్రమాల్లో స్థానిక నాయకులు, వివిధ సంఘాల ప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొన్నారు.


కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న రాష్ట్ర అధ్యాపక సంఘం కార్యదర్శి బలరాం జాదవ్

## సామాజిక చైతన్యానికి సాహిత్యమే ఊపిరి

**ఉట్నూర్,మార్చి 22,ప్రభాతవార్త :**

సామజిక చైతన్యానికి సాహిత్యమే ఊపిరి అని సాహితి వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు గోపగాని రవీందర్ అన్నారు. ఆదివారం ఉట్నూర్ సాహితి వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన కవి సమ్మేళనానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. సమాజంలోని చెడును రూపుమాపడానికి కవులు, రచయితలు తమ రచనల ద్వారా అహర్నిశలు కృషి చేస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో మనోహర్, భీంరావు, తిరుపతి, బంకట్ లాల్, మోతిరం, పరమేశ్వర, గోవింద్,సరస్వతి, తదితరులు పాల్గొన్నారు.




రైతు మహోత్సవం కార్యక్రమాన్ని వీక్షిస్తున్న అధికారులు, నాయకులు, రైతులు

## రైతు మహోత్సవం, రైతు భరోసా కార్యక్రమం

**హాజీపూర్, మార్చి 22, ప్రభాతవార్త**

రైతు మహోత్సవ కార్యక్రమం గుడిపేట రైతు వేదికలో దృశ్య శ్రవణ మాధ్యమం( వీడియో కాన్ఫరెన్స్ )లో ప్రత్యక్ష ప్రసారం రైతు నేస్తం కార్యక్రమం ద్వారా ఆదివారం వీక్షించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా జరగనున్న ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ ప్రారంభోత్సవం, రైతు భరోసా మొదటి నిధుల విడుదల కార్యక్రమాన్ని అధికారులు, రైతులు, నాయకులు వీక్షించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రైతులను ఉద్దేశించి మాట్లాడటం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారిణి సురేఖ, ఏడిఏ. కృష్ణ, కార్పొరేట్లు త్రివేణి, రాజయ్య, కమల, విస్తరణ అధికారులు, రైతులు, నాయకులు పాల్గొన్నారు.

## నవోదయ ప్రవేశ పరీక్షలో విద్యార్థుల ప్రతిభ

**సారంగాపూర్, మార్చి 22, ప్రభాతవార్త:**




మండల కేంద్రంలోని వింధ్యా స్కూల్ విద్యార్థులు నవోదయ ప్రవేశ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి ఘన విజయం సాధించారు. ఈ విద్యా సంవత్సరానికి సంబంధించి నిర్వహించిన ప్రవేశ పరీక్షా ఫలితాల్లో పాఠశాలకు చెందిన ఏ. అక్షర, ఆర్. రుగ్వేద్ నవోదయ విద్యాలయంలో సీట్లు సాధించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ ఆకుల రమేష్, ప్రిన్సిపాల్ కె. నవీన్ కుమార్ విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులు జాతీయ స్థాయి విద్యాసంస్థల్లో సీట్లు సాధించడం గర్వకారణమని వారు పేర్కొన్నారు. విద్యార్థుల గెలుపులో కీలక పాత్ర పోషించిన ఉపాధ్యాయులు శ్రీరామ్, శ్రీనివాస్, పల్లవి, శ్రీలత, సాయినాథ్, లావణ్య, సుమన్య, మంజుల తదితరులను కూడా ఈ సందర్భంగా అభినందించారు. విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాల యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు.



కమిటి సభ్యులతో కలిసి గోడ ప్రతులను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప

## ఏప్రిల్ 5న కోనేరు కాలనీలో అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ

### - ముఖ్య అతిథిగా కోనేరు కోనప్పకు ఆహ్వానం

కాగజ్‌నగర్ రూరల్, మార్చి 22, ప్రభాతవార్త :

సిర్పూర్ (టి) మండలం కోనేరు కాలనీలో ఏప్రిల్ 5వ తేదీన భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేయాలని సిర్పూర్ మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప కమిటీ సభ్యులు మర్యాదపూర్వకంగా ఆహ్వానించారు. అనంతరం ఆయన చేతుల మీదుగా నాటక ప్రదర్శనలకు సంబంధించిన గోడ ప్రతులను కమిటీ సభ్యులతో కలిసి ఆవిష్కరించారు. ఈ వేడుకను కోనేరు కాలనీ ప్రజలు, యువకులు కలిసి ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు సిద్ధమవుతున్నారు. కార్యక్రమంలో పలు సాంస్కృుతిక కార్యక్రమాలు, నాటక ప్రదర్శనలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కమిటీ సభ్యులు పిలుపునిచ్చారు.

## జన జాతీయ లోక్ సాంస్కృతిక సాహిత్యకి ఆహ్వానం

ఉట్నూర్,మార్చి 22,ప్రభాత వార్త :

న్యూఢిల్లీలో ఈనెల 25, 26వ తేదీల్లో నిర్వహించనున్న జజనజాతీయ లోక్ సాంస్కృుతిక సాహిత్యచ కార్యక్రమానికి ఉట్నూర్ మండలానికి చెందిన బంజారా కవి డాక్టర్ ఇందల్ సింగ్‌కు ఆహ్వానం లభించింది. ఇందిరాగాంధీ రాష్ట్రీయ మానవ సంగ్రహాలయ, నేషనల్ సెంటర్ ఫర్ ఆర్ట్స్ సంయుక్తంగా ఈ సదస్సు ను నిర్వహిస్తున్నాయి. దేశ రాజధాని వేదికగా ఇది తన జాతి సాహిత్యానికి దక్కిన గౌరవమని ఇందల్ సింగ్ హర్షం వ్యక్తం చేశారు.

## అంబేద్కర్ జయంతి ఉత్సవాల వాల్‌పోస్టర్ విడుదల

ఉట్నూర్,మార్చి 22, ప్రభాత వార్త :

వెడ్మ బొజ్జు పటేల్ శాసన సభ్యులు ఖానాపూర్ క్యాంప్ ఆఫీస్ ఉట్నూర్ లో ఎమ్మెల్యే చేతులు మీదుగా ఏప్రిల్ 21న బాబాసాహెబ్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జీవిత చరిత్ర నాటికి కార్యక్రమం ఏర్పాటు చేస్తున్న సందర్భంగా ఆదివారం వాల్ పోస్టర్ విడుదల చేశారు. శాసన సభ్యులు మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జయంతి ఉత్స వాల సందర్భంగా అంబేద్కర్ జీవిత చరిత్ర నాటికి ఏర్పాటు చేస్తున్న నిర్వాహకులను అభినందించారు. శాంతి భద్రతలు కాపాడుతూ శాంతి యుతంగా నిర్వహించాలని సూచించారు.ఈ కార్యక్రమం లోదాసండ్ల ప్రభాకర్,మాల మహానాడు ఆఫ్ ఇండియా జాతీయ ప్రధాన కార్యదర్శి , లింగంపల్లి చంద్రయ్య కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు, దూటా రాజేశ్వర్ ఆర్ టి ఓ మెంబర్ ఆదిలాబాద్ సుభాష్ బొంకంటి అధ్యక్షులు అంబేద్కర్ అసోసియేషన్ ఉట్నూర్ మండలం, కొత్తపల్లి మహేందర్, మార్స కోలా తిరుపతి, అచ్చ దేవానందం,వెంకటేష్, సంజీవ్, కొల్లూరి స్వామి, తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే వెడ్మ భోజ్జు

## చెక్కులను పంపిణీ చేసిన బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

నేరడిగొండ, మార్చి 22, ప్రభాతవార్త:

బోథ్ నియోజకవర్గంలోని వివిధ గ్రామాలకు చెందిన 76 మంది లబ్ధిదారులకు రూ.25.66 లక్షల విలువ గల ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ఆదివారం పంపిణీ చేశారు. నేరడిగొండ మండల కేంద్రంలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన లబ్ధిదారులకు స్వయంగా చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆపద కాలంలో పేద ప్రజలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఒక వరం లాంటిదని పేర్కొన్నారు. నియోజకవర్గంలో ఎవరైనా ప్రైవేటు ఆసుపత్రుల్లో వైద్యం చేయించుకుని ఉంటే, ఆసుపత్రి ఒరిజినల్ బిల్లులు, రోగి ఆధార్ కార్డు, రేషన్ కార్డు, బ్యాంక్ పాస్ బుక్, ఫోటోలతో తనను సంప్రదించాలని సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం నుంచి నిధులు అందేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ముఖ్యంగా పిప్పల్ కోటి గ్రామానికి చెందిన మెట్టిపల్లి వెంకట్ రెడ్డికి రూ.2.25 లక్షలు, కొడద్ గ్రామానికి చెందిన పన్నాల శివర్ధన్ రెడ్డికి రూ.1.75 లక్షలు, బజార్ హత్నూర్ మండలానికి చెందిన చాట్ల శ్యామలకు రూ.95 వేల చొప్పున చెక్కులను అందజేశారు. వీరితో పాటు వివిధ గ్రామాలకు చెందిన మరికొందరు లబ్ధిదారులకు మొత్తం కలిపి రూ.25,66,000 విలువైన చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ స్థాయి నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# హనుమాన్ దీక్ష స్వాములకు అన్నప్రసాదం

### - కుటుంబ సమేతంగా పాల్గొన్న నల్లాల ఓదెలు

మందమర్రి, మార్చి 22, ప్రభాతవార్త



దీక్ష స్వాముల సేవలో పాల్గొన్న ఓదెలు దంపతులు

మందమర్రి పట్టణంలోని పంచముచ హనుమాన్ ఆలయంలో భక్తి వాతావరణంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించబడింది. ఈ సందర్భంగా మాజీ ప్రభుత్వ విప్ నల్లాల ఓదేలు మాజీ మంచిర్యాల జిల్లా జడ్పీ చైర్ పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మి కుటుంబ సమేతంగా ఆలయాన్ని సందర్శించి మాల ధారణ స్వాములకు అన్నప్రసాదాన్ని అందించారు. ఆలయంలో పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న ఆయన స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతరం మాలధారణ చేసిన భక్తులకు ఓదెలు దంపతులు అన్నప్రసాదాన్ని స్వయంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన భక్తులతో కలసి ఆధ్యాత్మిక చింతనలో పాల్గొన్నారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు సమాజంలో ఆధ్యాత్మికతను పెంపొందించడమే కాకుండా భక్తుల మధ్య ఐక్యతను మరింత బలోపేతం చేస్తాయని ఈ సందర్భంగా పలువురు అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు అర్చకులు ఓదెలు-భాగ్యలక్ష్మి దంపతులను శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు, స్థానిక భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## శనగ కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్

భైంసా, మార్చి 22, ప్రభాతవార్త:



రైతుల శ్రేయస్సు కోసం ప్రభుత్వం కల్పిస్తున్న మద్దతు ధర సౌకర్యాన్ని ప్రతి రైతు సద్వినియోగం చేసుకోవాలని ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ కోరారు. ఆదివారం భైంసా మార్కెట్ యార్డు, కుబీర్ మార్కెట్ యార్డు, తానూర్, ముధోల్ గోదాముల్లో మార్క్‌ఫెడ్, నాఫెడ్, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శనగ కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల అభివృద్ధికి కట్టుబడి ఉన్నాయని తెలిపారు. శనగ పండించిన రైతులు ప్రైవేటు వ్యాపారుల వద్ద తక్కువ ధరకు అమ్మి నష్టపోకుండా, ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేంద్రాలను వినియోగించుకోవాలని సూచించారు. ప్రస్తుతం శనగకు క్వింటాలుకు రూ.5,875 మద్దతు ధర నిర్ణయించామని, పంటలో తేమ శాతం 14 మించకుండా జాగ్రత్త వహించాలని ఆయన స్పష్టం చేశారు. ప్రైవేటు మార్కెట్ ధరలతో పోలిస్తే ప్రభుత్వ మద్దతు ధర ఎక్కువగా ఉండటం వల్ల రైతులు ఈ అవకాశాన్ని వాడుకోవాలన్నారు. త్వరలోనే మక్కా, జొన్న కొనుగోలు కేంద్రాల ప్రారంభం కోసం విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లానని, అతి త్వరలోనే ఆ కేంద్రాలు కూడా అందుబాటులోకి వస్తాయని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనంద్ రావు పాటిల్, మార్కెట్ కమిటీ సభ్యులు, వివిధ సంఘాల నాయకులు, రైతులు పాల్గొన్నారు.

## సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి రూ.32 లక్షల నిధులు

### - మాజీ ఎమ్మెల్యే విఠల్ రెడ్డి

భైంసా, మార్చి 22, ప్రభాతవార్త:



కుబీర్ మండలంలోని వివిధ గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి సుమారు రూ.32 లక్షల నిధులు మంజూరయ్యాయని ముధోల్ మాజీ ఎమ్మెల్యే జి. విఠల్ రెడ్డి తెలిపారు. ఆదివారం భైంసాలోని తన నివాసంలో ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులకు అభివృద్ధి పనులకు సంబంధించిన ప్రొసీడింగ్ పత్రాలను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కుబీర్ మండలంలోని సోమేశ్వర్, బ్రాహ్మేశ్వర్ గ్రామాలకు రూ.8 లక్షలు, మార్లగొండ గ్రామ పంచాయతీ అనుబంధ గ్రామాలైన శోక్లా నాయక్ తండా, నంద్ పహాడ్, కిరు నాయక్ తండాలకు రూ.21 లక్షలు, సేవాదాస్ నగర్‌లో పనుల కోసం రూ.3 లక్షల నిధులు కేటాయించినట్లు వివరించారు. గ్రామాల అభివృద్ధికి నిధులు మంజూరు చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్చార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావుకు గ్రామస్తులు, నాయకులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శ్యామ్ రావు, ఉపసర్పంచ్ రోహిదాస్, బ్రాహ్మేశ్వర్ సర్పంచ్ అశోక్ రాథోడ్, సీనియర్ నాయకులు దత్తురామ్, ఏఎంసీ డైరెక్టర్ అరుణ్, శివరాం నాయక్, గోవింద్ రాథోడ్, రమేష్, ఉత్తమ్, తానాజీ, ఇందల్, మాజీ సర్పంచ్ దత్తు గౌడ్, వివిధ గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.



## తాండ్రలో వైభవంగా గ్రామ దేవతల విగ్రహ ప్రతిష్టాపన

సారంగాపూర్, మార్చి 22, ప్రభాతవార్త:

సారంగాపూర్ మండలంలోని తాండ్ర (జి) గ్రామంలో ఆదివారం గ్రామ దేవతల విగ్రహ ప్రతిష్టాపన మహోత్స వం అత్యంత భక్తిశ్రద్ధలతో జరిగింది. గ్రామ వీడీసీ సభ్యులు, ద్యావంత్ మహేశ్వర్ ఆధ్వర్యంలో గ్రామ ప్రజలందరూ కలిసి ఈ వేడుకను ఘనంగా నిర్వహించారు. పోతరాజులు, బద్ది పోచమ్మ, నాగదేవతమ్మ, ముత్యాల పోచమ్మ దేవతల విగ్రహాలను ప్రతిష్టించేందుకు గ్రామంలోని సర్గమ్మల దేవాలయం నుండి మహిళలు బోనాలను ఎత్తుకొని ఊరేగింపుగా బయలుదేరారు. గ్రామ ప్రధాన వీధుల గుండా సాగిన ఈ శోభాయాత్ర బస్టాండ్ మీదుగా ఊరి బయట ఉన్న మహాలక్షి ్మ ఆలయానికి చేరుకుంది. అక్కడ అమ్మవారి చిత్రపటాలను ఉంచి ప్రత్యేకంగా అలంకరించారు. ఈ సందర్భంగా సంప్రదాయబద్ధంగా గావు పట్టే కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం నూతనంగా తయారు చేయించిన ముత్యాల పోచమ్మ, బద్ది పోచమ్మ, పోతలింగన్న విగ్రహాలను శాస్త్రోక్తంగా నెలకొల్పారు. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో సర్పంచ్ వెన్నెల నర్స య్య, గ్రామ వీడీసీ సభ్యులు, గ్రామ పెద్దలు, యువజన సంఘాల ప్రతినిధులు, మహిళలు, చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. విగ్రహ ప్రతిష్టాపన అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

## వడూర్‌లో మెగా మెడికల్ క్యాంప్‌కు విశేష స్పందన

నేరడిగొండ, మార్చి 22, ప్రభాతవార్త:

మండలంలోని వడూర్ గ్రామంలో ఆదిలాబాద్ శ్రీ కృష్ణ హాస్పిటల్ సౌజన్యంతో నిర్వహించిన మెగా మెడికల్ క్యాంప్‌కు ప్రజల నుండి విశేష స్పందన లభించింది. ఈ వైద్య శిబిరాన్ని బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఆడే గజేందర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సుమారు 350 మంది రోగులకు వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆడే గజేందర్ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంత ప్రజల ఆరోగ్య సమస్యలను దృష్టిలో ఉంచుకుని ఈ ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వివిధ విభాగాలకు చెందిన నిపుణులైన వైద్యులు రోగులను పరీక్షించి తగిన సలహాలు, సూచనలు అందజేశారన్నారు. పేద ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్యం చేరువ చేయడమే లక్ష్యంగా ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ శిబిరంలో వడూర్, పరిసర గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని వైద్య సేవలు పొందారు. కార్యక్రమంలో హాస్పిటల్ సిబ్బంది, స్థానిక నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



రోగులను పరామర్శిస్తున్న బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఆడే గజేందర్